క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి విరాళం



దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందిస్తున్న అధికారులు, పండితులు

మహానంది: క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్న దాన ప్రసాద పథకానికి హైదరాబాద్ నగరానికి చెందిన అజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు ఆదివారం రూ.51,001 విరాళం అందించినట్లు ఆలయ సూపరింటెండెంట్ ఎం.నీలకంఠేశ్వరరాజు తెలిపారు. ఈ మేరకు వారు యాగశాల వద్ద వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తదితరులను కలిసి విరాళం సొమ్ము అందించారు. దాతలకు స్వామి, అమ్మవారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: పండ్లు, ఆకు, కూరగాయల తోటలు పెంచుతున్న రైతులు ప్రభుత్వం రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కూరగాయలు పండించి వాటిని విక్రయించుకోదలచిన వారి కోసం ప్రభుత్వం 50 శాతం రాయితీపై రూ.30వేల విలువైన తోపుడు బండిని అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే పండ్లు, మిరప, ఉల్లి, తదితర పంటలు సాగుచేసిన రైతులకు రాయితీపై సోలార్ పాలీ డ్రైయర్స్ యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 100కిలోల యూనిట్ పూర్తి ధర రూ.3,50,000లు కాగా 40శాతం రాయితీ రూ.1,40,000లు పోను రైతులు 2,10,000లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 70కిలోల యూనిట్ పూర్తి ధర రూ.2,50,000లు కాగా రాయితీ రూ.లక్ష పోను రైతులు రూ.1,50,000లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో గానీ లేదా నందికొట్కూరు హార్టికల్చర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

ఉప్పాగులో పడి వ్యక్తి మృతి

బండి ఆత్మకూరు : మండలంలోని ఈర్నపాడు గ్రామంలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి గోకారి (42) ఉప్పాగులో పడి మృతి చెందాడని ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు.వివరాలు.. గోకారి బట్టలు ఉతకడానికి వాగులోకి వెళ్లి, ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని మిడుతూరు రోడ్డు వైపు ఈనెల 10వ తేదీ పంట పొలాలలో గడ్డి మందు తాగి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓర్వకల్లు మండలం, నన్నూర్ గ్రామానికి చెందిన షేక్ ఖాజాబాషా(30) కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. భార్య పుట్టింటికి చెప్పకుండా వెళ్లిందని గొడవ పడి ఎవరికి చెప్పకుండా బయటికి వచ్చాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

నంద్యాల కవులకు సత్కారం

నంద్యాల(వ్యవసాయం): మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఇదారహ్ అదబ్ ఇస్లామియా తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ఉర్దూ కవి సమ్మేళనంలో నంద్యాల కవులకు సత్కారం లభించినట్లు కవులు అబ్దుల్‌సమ్మద్, మహమ్మద్ రఫీ, అజాద్‌ఖాన్, మహమ్మద్ జాఫర్ తెలిపారు. సమ్మేళనంలో తెలుగు రాష్ట్రాల నుంచి 60 మందికి పైగా కవులు పాల్గొన్నట్లు వెల్లడించారు.

3న భారత్ బంద్

ఆళ్లగడ్డ: వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా అక్టోబర్ 3వ తేదీ నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని జేఏసీ అధ్యక్షుడు బీరువాల బాషా కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.నంద్యాల ముస్లిం జేఏసీ నాయకుడు మౌలానా అబ్దుల్, రజకసంఘం నాయకుడు రమణ, మాలమహానాడు జిల్లా సెక్రటరీ చక్రవర్తి వెంకట్, నరసయ్, వెంకటసుబ్బయ్య ఉన్నారు.

గురువులకు పాదాభివందనం



గురువులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

మహానంది: పూర్వ విద్యార్థులు గురువులకు పాదాభివందనం చేసి ఆశీర్వచనం తీసుకున్నారు. శ్రీశైలం సున్నిపెంటలోని గిరిజన పాఠశాలలో 1993–94లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మహానందిలో కలిశారు. ఈ మేరకు నాటి రోజుల్లో వారికి చదువులు చెప్పిన గురువుల కాళ్లకు నమస్కరించి వారి పట్ల విధేయత చాటుకున్నారు.

ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే అరాచకాలు

- కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని చట్టం ముందు నిలబెడతాం
- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హెచ్చరిక
- వెలుగోడులో డిజిటల్ బుక్ ఆవిష్కరణ



వెలుగోడులో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: శ్రీశైలం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రోద్బలంతోనే అరాచకాలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మండిపడ్డారు. తమ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం నడుపుతున్న రెడ్ బుక్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు అండగా ఉండేందుకు డిజిటల్ బుక్‌ను ప్రారంభించారని చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతోందన్నారు. వాటి నుంచి పార్టీ శ్రేణులను కాపాడుకునేందుకు డిజిటల్ బుక్ ఉపయోగపడుతుందన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి కార్యకర్తలు తమ ఇబ్బందులపై ఫిర్యాదు చేస్తే వారికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఛీఛీ ఉటచ్ ఇఛోరు లోకి వెళ్లి కార్యకర్త ఫోన్ నంబర్‌ను టైప్ చేయగానే ఓటీపీ వస్తుందన్నారు. తర్వాత వివరాలు పూర్తి చేసి అన్యాయానికి సంబంధించి డాక్యుమెంట్లు, వీడియోలు అప్‌లోడ్ చేస్తే డిజిటల్ బుక్‌లో స్టోర్ అవుతాయన్నారు. ఐవీఆర్ విధానం ద్వారా 040–49171718 టెలిఫోన్ నంబర్‌కు కాల్ చేసిన తర్వాత ఫిర్యాదు ఎలా చేయాలన్న దానిపై గైడెన్స్ ఇస్తూ పూర్తి చేస్తుందని వివరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు మనదే..

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పోటీ చేస్తుందని, విజయం మనదేనని, ఎవరూ అధైర్య పడొద్దని శిల్పా భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో మూడు పథకాలు సగం మాత్రమే అమలు చేసి సూపర్ హిట్ అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇంతవరకు ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదని, యూరియాను అక్రమ మార్గాల్లో అధికార పార్టీ నేతలు తరలించుకుపోతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకుడు దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీలు లాలం రమేష్, మహేశ్వరరెడ్డి, ఆత్మకూరు పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, వెలుగోడు పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, నాయకులు వంగాల వెంకట్రామిరెడ్డి, వంగాల నాగేశ్వరరెడ్డి, బోగోలు సుదర్శనం, శ్రీనివాసులు, ఎంపీటీసీ చాంద్, గోవింద్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్‌బుక్‌కు పోటీగా డిజిటల్ బుక్..

కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి పోటీగా జగనన్న డిజిటల్ బుక్ ఏర్పాటు చేశారని అన్నారు. ఫిర్యాదులపై వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక డిజిటల్ బుక్‌లో నమోదైన కేసులపై దర్యాప్తు చేయించి న్యాయం చేస్తామన్నారు.

చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న దార సుధీర్



చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్, శ్రేణులు

నందికొట్కూరు: పట్టణంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిని నవరాత్రుల సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కౌన్సిలర్ అల్లూరి కృష్ణ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పుల్యాల నాగిరెడ్డి, విజ్జి, కోకిల రమణారెడ్డి, తిరుమలేష్‌రెడ్డి, ఉపేంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాణ్యం నాగరాజు, సులోచనమ్మ, మాధురి, భార్గవ్ తదితరులు ఉన్నారు.

వనదేవత అలంకరణలో ఉమామహేశ్వరి



ఓంకార క్షేత్రంలో వనదేవతగా దర్శనమిచ్చిన ఉమామహేశ్వరి



ఆత్మకూరులో మహాగౌరీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



వెలుగోడు: మహా చండీదేవి అలంకరణలో వాసవీ మాత



బుక్కాపురంలో శ్రీ మహాచండీదేవిగా



కొత్తపల్లి: మహా చండీ దేవిగా కొలనుభారతీదేవి



పగిడ్యాలలో చండీదేవి అలంకరణలోని దుర్గామాతకు పూజలు



పాములపాడులో లలితాదేవి అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు



జూపాడుబంగ్లా క్వార్టర్స్‌లో స్వర్ణకవచంతో మహాచండీగా సరస్వతీదేవి



నందికొట్కూరులో మహాచండిగా వాసవీమాత



మిడుతూరులో మహాచండీ మాతగా ..

సాక్షి నెట్‌వర్క్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీశైలం, నందికొట్కూరులోని వివిధ ఆలయాలు, మండపాల్లో కొలువుదీరిన అమ్మవార్లు వివిధ రూపాల్లో కొలువుదీరారు. వనదేవతగా, మహాగౌరి, మహాచండీదేవి అలంకరణలో దర్శనమివ్వడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎక్కడ అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలి
- వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు సీఎం బాబు డైవర్షన్ పాలిటిక్స్



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్, పార్టీ శ్రేణులు

నందికొట్కూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడేందుకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టిన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. వారిని చట్టం ముందు నిలబెట్టేందుకే డిజిటల్ బుక్‌ను తేవడం జరిగిందన్నారు. పార్టీ శ్రేణులపై దాడులు జరిగిన సమయంలో గాయాలుంటే ఫొటోలు డిజిటల్ బుక్‌లో అప్‌లోడ్ చేయవచ్చన్నారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టినా వారి పేర్లు, వివరాలు కూడా ఎప్పటికప్పుడు నమోదు చేస్తే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూస్తారని స్పష్టం చేశారు.

కూటమి పాలనలో పెరిగిన దాడులు

కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులపై, కార్యకర్తలపై దాడులు, హత్యలు, మహిళలపై హత్యాచారాలు ఎన్నడూ లేని విధంగా పెరిగిపోయాయని దార సుధీర్ అన్నారు. జగనన్న పాలనలో 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేశారన్నారు. ఐదు మెడికల్ కళాశాలలో తరగతులు జగనన్న పాలనలో ప్రారంభించడం జరిగిందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు సీఎం చంద్రబాబు పూనుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు సీఎం బాబు కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. రేషన్, ఇసుక మాఫియా ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడీ చేసి జేబులు నింపుకుంటున్నారని చెప్పారు. రెండో ఐవీఆర్ఎస్ విధానంలో ఫోన్ నంబరు 040–49171718 ద్వారా కూడా నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక ప్రతీది డైవర్షన్ చేయడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, సర్పంచులు జనార్దన్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పుల్యాల నాగిరెడ్డి, జబ్బార్, రమేష్‌నాయుడు, కోకిల రమణారెడ్డి, తులసిరెడ్డి, తిరుమలేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, నాగరాజు, రమణ, మాధురి, సులోచనమ్మ, సురేష్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, ఉపేంద్రారెడ్డి, పాణ్యం నాగరాజు, బంగారు, శివ, నరేష్‌రెడ్డి, మల్లయ్య, డాక్టర్ చంద్రశేఖర్, నాగార్జున, రంగారెడ్డి, ఏసురత్నం, బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి పోరాటాలు



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

బండి ఆత్మకూరు: రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విస్తృత పోరాటాలు నిర్వహించాలని ఏపీ రైతు సంఘం నేత టి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఆదివారం సంఘం మండల నాయకులు సుధాకర్ రెడ్డి, రామచంద్రుడు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. రమేష్ కుమార్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తుందని, నూతన వ్యవసాయ చట్టాలు, మోటార్లకు మీటర్లు, ఉచిత విద్యుత్ రద్దు వంటి రైతు వ్యతిరేక నిర్ణయాలకు పూనుకుంటున్నదని మండిపడ్డారు. పంటలకు కనీస మద్దతు ధర లేకపోవడం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎల్లయ్య, మదార్ వలి, ఉపాధ్యక్షులుగా సర్వారెడ్డి, బాల సుంకన్న, కార్యదర్శులుగా సుధాకర్ రెడ్డి, గుర్రప్ప, సభ్యులుగా సంజీవరెడ్డి, నాగన్న, బాలస్వామి ఎన్నికయ్యారు.

గుర్రంజాషువా జయంతి



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: స్థానిక సుదర్శనవర్మ స్మారక భవనంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు వి.యేసురత్నం, జిల్లా సహాయ కార్యదర్శి పాతకోట భాస్కర్ మాట్లాడుతూ కలం పోటుతో కులం బూజు దులిపిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని కొనియాడారు. సామాజిక అణిచివేతను, కుల వివక్షతను తన కలం ద్వారా తరిమికొట్టాడన్నారు. నాయకులు సుధాకర్,రామ్‌నాయక్, దినేష్ పాల్గొన్నారు.

మహిళ మిస్సింగ్ కేసు ఛేదన



మహిళతో పోలీసులు

ఆత్మకూరు: బందోబస్తు విధులు నిర్వహిస్తూ మహిళ మిస్సింగ్ కేసును ఆత్మకూరు పోలీసులు ఆదివారం ఛేదించారు. వివరాలు.. ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొట్టాల చెరువు గ్రామంలో శాంతిబాయి కనిపించడం లేదని మొదటి భర్త కుమారుడు కాశీ విశ్వేశ్వరనాయక్ 2023 మే 16న ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు మహిళ ఆచూకీ దొరకలేదు. ప్రస్తుతం ఆత్మకూరు టౌన్ ఎస్ఐ నారాయణరెడ్డి తిరుమల బ్రహ్మోత్సవాల బందోబస్తులో ఉండగా తిరుమలలో గుర్తించి భర్త మూర్తికి అప్పగించారు. బందోబస్తు విధులు నిర్వహిస్తూనే మహిళను భర్తకు అప్పగించినందుకు నంద్యాల ఎస్పీ అభినందించారు.

ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారం



ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయరామకృష్ణ దంపతులను ఘనంగా సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

నందికొట్కూరు: పట్టణంలో వెలసిన శ్రీ చక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి దేవస్థానం, పట్టణ నూతన ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ప్రమాణాస్వీకారం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడిగా అరవేటి సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడిగా బీమిశెట్టి జయరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీనివాసులు(ఎల్ఐసీ), కోశాధికారిగా వీరబొమ్మ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు, యువజన సంఘం అధ్యక్షులుగా బైసాని శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దొంతు నిహాంత్, కోశాధికారి కోపురు పద్మకుమార్, కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు. నూతన కమిటీల సభ్యులను ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు.

ఆర్థిక సాయం

మహానంది: బొల్లవరం గ్రామానికి చెందిన గుండా ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న మండలం జనసేన నాయకులు ఆదివారం రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు. నాయకులు కాకర్ల రామకృష్ణ, డమాల చందు, కామిని ప్రసాద్, ఉత్తమ సేవా అవార్డు గ్రహీత పెద్దమురళి, మహేశ్ తదితరులు ఆదివారం గ్రామానికి చేరుకుని బాధితుడికి నగదు అందించారు.

తగ్గని నీటి ఉధృతి



బుక్కాపురం వంతెనపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

మహానంది: నంద్యాల నుంచి మహానంది వెళ్లే మార్గంలో బుక్కాపురం వద్ద ఉన్న తమ్మడపల్లె చెరువు అలుగు నీటి ఉధృతి తగ్గడం లేదు. కొద్దిరోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో చెరు వు పూర్తిగా నిండిపోయింది. దీంతో నీరు అలుగు ప్రవహిస్తోంది. తాజాగా ఆదివారం రాత్రి వరకు రోడ్డుపై రెండు అడుగుల మేర నీరు ప్రవహించింది. దీంతో నంద్యాల నుంచి మహానంది, మహానంది నుంచి నంద్యాల వెళ్లే ప్రయాణికులు, మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు అవస్థలు పడ్డారు. ఇదిలా ఉండగా అలుగుల వద్ద చిన్నపిల్లలు ఉండటం,వాహనాలకు ఎదురెళ్లండటంపై పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని చెప్పారు.

చెరువుల్లా కాలనీలు



కాలనీలో నిలిచిన నీటిని చూపుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీల్లో చెత్తను తొలగించకపోవడంతో వర్షాలకు రోడ్లపై నీరు పారుతూ చెరువును తలపిస్తున్నాయని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ అన్నారు. ఆదివారం పార్టీ పట్టణ కమిటీ బృందం రోడ్లపై ఆగి ఉన్న నీటిని పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీగా ఏర్పడి దాదాపు 15 ఏళ్లు కావొస్తున్నా అనేక నాలల్లో ఇప్పటికే సిమెంట్ రోడ్లు లేక డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. రోడ్లపై ఆగి ఉన్న మురుగునీటిలో నడవాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, ఎస్.వీరన్న, నాయకులు అంబయ్య, గణపతి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన



భక్తి సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్య కళావేదికపై విజయవాడకు చెందిన గాయత్రీ నృత్య నికేతన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన, వి.కృష్ణ కుమార్ భక్తి సంగీత విభావరి నిర్వహించారు.ఆయా కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

స్ఫూర్తి ప్రదాత భగత్‌సింగ్



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: భగత్‌సింగ్ నవతరానికి స్ఫూర్తి ప్రదాత అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.దినేష్‌కుమార్, డీవైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకుడు రామ్‌నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో భగత్‌సింగ్ 118వ జయంతిని నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఆకాంక్షను నిలువెల్లా నింపుకుని ఉద్యమం తరంగంగా ఆంగ్లేయులపై ఎగిసిపడి యువతను ఉద్యమంలో భాగస్వామ్యం చేసిన వీరుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. పన్నేడేళ్లకే భారతజాతి విముక్తి కోసం ఉద్యమ ప్రయాణాన్ని అవపోసనపట్టి 14 ఏళ్లకే భారత స్వాతంత్య్ర సంగ్రామంలోకి అడుగులేసి 23 ఏళ్లకే ఉరితాడుని ముద్దాడిన గొప్ప నాయకుడన్నారు. ప్రతిఒక్కరూ భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. నాయకులు చిన్న లాజరస్, బన్నీ, జగదీష్ పాల్గొన్నారు.

నేర నియంత్రణకు కార్డెన్ సెర్చ్

నందికొట్కూరు: నేర నియంత్రణలో భాగంగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహిస్తునట్లు టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని నీలిషికారి పేటలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత, పాత నేరస్తులు ఇళ్లలో తనిఖీలు చేశారు. నాటు సారా విక్రయిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అపరిచిత వ్యక్తులపై ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.

బంగారు పడిగె కానుక

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి వారికి భక్తులు బంగారు పడిగెను బహూకరించినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన బాష్యం సుబ్బనరసయ్య గౌడ్, మల్లమ్మ దంపతుల కుమారుడు నాగమనోహర్, భార్య సరితలు 10 గ్రాముల బంగారు పడిగె సమర్పించారు. దాతల కుటుంబానికి ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లవి సీడ్స్ దుకాణం లైసెన్స్ రద్దుచేయాలి



నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

జూపాడుబంగ్లా: రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టి మోసం చేసిన నందికొట్కూరు పల్లవి సీడ్స్ లైసెన్స్ రద్దుచేసి దుకాణాన్ని సీజ్ చేయాలని సీపీఎం మండల కన్వీనర్ కర్ణ, రైతు సంఘం నాయకులు లోకారెడ్డి డిమాండ్‌చేశారు. నకిలీ విత్తనాలతో 80బన్నూరులో నష్టపోయిన రైతుల మొక్కజొన్న పొలాలను ఆదివారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎకరా పొలం రూ.20వేల చొప్పున పొలం కౌలుకు తీసుకొని కౌలు రైతులు, రైతులు మొక్కజొన్న పంటలు సాగుచేశారన్నారు. వారికి నకిలీ మొక్కజొన్న విత్తనాలు విక్రయించటంతో సాగుచేసిన పంటకు కంకులు వచ్చినా సక్రమంగా విత్తనాల్లేవన్నారు. దీంతో రైతులు తీవ్రంగా పంట నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.70వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, దేవరాజు, బాధిత రైతులు మగ్బుల్‌బాషా, అబ్దుల్ రహిమాన్, చిన్న అల్లబకాస్, ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.